క్లుప్తంగా

డోల్షా పైల్వాన్ మస్జిద్ సందర్శన



వక్ఫ్‌బోర్డు చైర్మెన్ షేక్ ఖాజాకు స్వాగతం పలుకుతున్న ముస్లింలు

ఆదోనిసెంట్రల్: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన డోల్షా పైల్వాన్ మస్జిద్‌ను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ షేక్ ఖాజా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయనను సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. ఖాజా మాట్లాడుతూ డోల్షా పైల్వాన్ మస్జిద్‌ను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. హజరత్ దుల్‌షా పహిల్వాన్ ద్వారా మదర్సా, పాఠశాల, టైలరింగ్ వంటివి వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు బాగా నిర్వహిస్తున్నారని అభినందించారు. మస్జిద్ ముందు కాంప్లెక్స్ నిర్మించాలని స్థానికులు కోరగా బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముతల్లి జిక్రియా, నియాజ్ అహ్మద్, అహ్మద్ హుసేన్, వక్ఫ్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకులో పెరుగుతున్న నీటిమట్టం



ఎస్ఎస్ ట్యాంకులోకి చేరుతున్న నీరు

ఆదోనిటౌన్: పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. చెరువుకట్ట మరమ్మతులతో గత మాసంలో తుంగభద్ర దిగువ కాలువ నుంచి రా వాటర్ పంపింగ్ కొన్ని రోజులు నిలిపివేశారు. అయితే చెరువును పూర్తిస్థాయిలో నింపుకోవాలని, వచ్చే వేసవిలో నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే కాలువ నుంచి నీటి పంపింగ్ వేగవంతం చేశారు. దీంతో 40 శాతం మేర నీటి నిల్వ చేరినట్లు మున్సిపల్ వాటర్ వర్క్స్ అధికారులు తెలిపారు. నెలాఖరిలోపు పూర్తిస్థాయిలో నింపుతామని చెప్పారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



కోసిగి బస్టాండ్‌లో అనాథ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో 40 ఏళ్ల వయస్సు కలిగిన ఓ అనాథ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. కొద్ది రోజులుగా గ్రామంలో తిరుగుతుండేవాడు. బస్టాండ్‌లో మృతి చెందడంతో స్థానికులు పంచాయతీ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో సర్పంచ్ అయ్యమ్మ , పంచాయతీ కార్యాదర్శి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు మాణిక్యరాజు, రాజేష్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లో తీసుకెళ్లి శ్మశానవాటికలో సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

మాధవరం తండాలో 5కే రన్

మంత్రాలయం: మండలంలోని మాధవరం తండా గ్రామానికి చెందిన ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్ పోటీలను ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, మాధవరం ఎస్ఐ కిరణ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులంతా కలిసి దీపావళి సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

తాత్కాలిక రోడ్డు పనులు ప్రారంభం



గుంతలను పూడ్చివేస్తున్న యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు గేటు సమీపంలోని బసాపురం రోడ్డు వరకు తాత్కాలిక రోడ్డు పనులను యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్ ఆదివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. యార్డు నిధులతో తాత్కాలికంగా రోడ్డు వేయిస్తున్నట్లు చెప్పారు.

ఏబీవీపీ భాగ్ కన్వీనర్ ఎంపిక

కోసిగి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సంఘం తాలూకా భాగ్ కన్వీనర్‌గా కోసిగికి చెందిన శిరివారం వినోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈనెల 10,11వ తేదీల్లో నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో ఏబీవీపీ విభాగ్ సైద్ధాంతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పొందిన వినోద్ కుమార్‌ను ఏబీవీపీ కర్నూలు విభాగ్ ప్రముఖ్ డాక్టర్ నాగఫణి శాస్త్రి మంత్రాలయం తాలూకా భాగ్ కన్వీనర్‌గా నియమించారు. వినోద్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఆదోనిటౌన్: అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం పట్టా, పక్కా ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పరిషముల్లా వీధికి చెందిన పేద ముస్లిం మహిళలు 82 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలో ఇంటి స్థలం కోసం రూ.2,100 డీడీలు కట్టిన ప్రతిఒక్కరికీ స్థలం మంజూరు చేస్తామన్నారు. అప్పట్లో 8 వేల మందికి స్థలాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మండిగిరి లేఅవుట్‌లో 10,200 మందికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం 2 వేలకు పైగానే ఇళ్లు పూర్తయ్యాయని, మరో 3 వేల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు.

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుండె జబ్బుకు చికిత్స..

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుండె సంబంధ వ్యాధులకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నారని, అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. గుండె జబ్బుకు సంబంధించి రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజెక్షన్లు ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్నాయన్నారు. వారం క్రితం మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన ఆంజనేయులు అర్ధరాత్రి సమయంలో గుండెపోటుకు గురవగా కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు రూ.40 వేల విలువజేసే ఇంజెక్షన్ వేసి, ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యం పొంది ఇంటికి చేరుకున్నాడని చెప్పారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నకాతే శ్యామ్‌ప్రసాద్, సమ్మద్‌బాషా, సయ్యద్, వీఆర్వో జయరామిరెడ్డి పాల్గొన్నారు.



మహిళలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ఆదోనిరూరల్: గోనబావి గ్రామానికి చెందిన 20 మంది మహిళలకు హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం సహకారంతో 'ఉజ్వల ఉచిత గ్యాస్' కనెక్షన్లను సోమవారం తన ఇంటి ఆవరణలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అందజేసిన ఉచిత గ్యాస్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేతా శ్యామ్, మండల కో–ఆప్షన్ మెంబర్ వరదరాజస్వామి, సర్పంచ్ ఆలీ పాల్గొన్నారు.

వైభవంగా నరకచతుర్దశి వేడుకలు



గోపూజలో పాల్గొన్న పీఠాధిపతి



వేడుకలను తిలకిస్తున్న భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో నరకచతుర్దశి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల నేతృత్వంలో శాస్త్రోక్తకంగా వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గోపూజ, తులసి పూజ, తైల అభ్యంగన పూజలు చేపట్టారు. అలాగే సంస్థాన పూజల్లో భాగంగా మూలరామ, జయరామ, దిగ్విజయ రామ పూజలను వేదపండితుల మధ్య గావించారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనానికి విశేష పూజలు చేశారు. స్వామిజీకి ప్రత్యేక నారీకృత నీరాజనం, తైల అభ్యంగన స్నానం చేయించి అనంతరం ఉంజల మండపంలో అనుగ్రహ సందేశం, మంత్రాక్షితలతో ఆశీర్వాదం చేశారు.

శ్రీ మఠంలో అమావాస్య పూజలు..

శ్రీమఠంలో సోమవారం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో అమావాస్య పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

భక్తులతో ఉరుకుంద కిటకిట

కౌతాళం: అమావాస్య సందర్భంగా సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం దీపావళి పండుగతో పాటు సోమవారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవాడానికి భారీగా తరలివచ్చారు. సెలవు రోజులతో పాటు అమావాస్య కలిసి రావడంతో ఆదివారం సాయంత్రం నుంచే క్షేత్రానికి భక్తుల రాక మొదలైంది. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులకు దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, మహామంగళహరతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. పలువురు భక్తులు ఆలయన పరిసరాల్లో పిండివంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప డిపోల వారు ప్రత్యేక బస్సులు నడిపారు.

బుదుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో..

ఉరుకుందకు ఐదు కి.మీ. దూరంలో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య కావడంతో భక్తులతో సందడిగా మారింది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజనేయ స్వామిని దర్శనానికి రావడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. అలాగే.. తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. కర్ణాటక సరహద్దు ప్రాంతం కావడంతో కర్ణాటక భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.



విశేష అలంకరణలో ఈరన్నస్వామి

గద్వాల సోమన్నను వరించిన 'బాలసాహిత్యరత్న'

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను బాలసాహిత్యరత్న బిరుదు వరించింది. మహర్షి వాల్మీకి సాంస్కృతిక సాహితీ సంస్థ అధ్యక్షుడు, విశ్రాంత భూగర్భ గనుల శాఖ అధికారి డాక్టర్ వీ.డి.రాజగోపాల్ హైదరాబాద్‌లో ఆదివారం బిరుదును ప్రదానం చేశారు. అలాగే ఆయన రచించిన 42వ కొత్త పుస్తకం ప్రతిబింబాలు బాలగేయాల సంపటి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఏఎల్ కృష్ణారెడ్డి, బిక్కి కృష్ణ, నాశేశ్వరం శంకరం, రాజా వాసిరెడ్డి మళీశ్వరి చేతుల మీదుగా అవిష్కరించారు. అనంతరం గద్వాల సోమన్నను సత్కరించారు.



ప్రతిబింబాలు పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

నేటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

మంత్రాలయం: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి నాలుగురోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమ నిలయంలో టీటీడీ ధార్మిక మండలి సభ్యులు సూర్యనారాయణతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం హనుమాన్‌చాలీసా పారాయణం, బుధవారం మహాభారతం భజన, గురువారం భగవద్గీత భజన, శుక్రవారం గోపూజ, కుంకుమార్చన అనంతరం శోభాయాత్ర ఉంటుందని వివరించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లువెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జి.భీమారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వై.సీతారామిరెడ్డి

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఆదోనిఅర్బన్: సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద ఐరన్ షాపు, పంజరాపోల్ ఆంజనేయస్వామి ఆలయంలోని హుండీ చోరీల కేసుకు సంబంధించిని నిందితుడిని అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంనిర్వహించి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బాలకొలను గుడి వద్ద సిబ్బంది సాయంతో వేచి ఉండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా, ఈ ఏడాది మే నెలలో సిరుగుప్ప చెక్‌పోస్టు వద్దనున్న ఇమ్రాన్ ఐరన్ షాపులో రూ.1.20 లక్షలు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడన్నారు. అలాగే జూన్ నెలలో పంజరాపోల్‌లోని ఆంజనేయస్వామి గుడిలోని హుండీని పగలగొట్టి అందులోని రూ.6 వేల నగదు, స్వామివారి 15 తులాల వెండి కవచం, కన్నులు, పాదాలను ఎత్తుకెళ్లినట్లు అంగీకరికరించాడని చెప్పారు. ఈ మేరకు నిందితుడి నుంచి స్వామి వారి వెండి ఆభరణాలు, రూ.1.10 లక్షల నగదును స్వా.దీనం చేసుకున్నామని వివరించారు. కాగా నిందితుడు.. పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ నరసింహుడిగా గుర్తించామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి, సిబ్బంది రంగస్వామి, లక్ష్మణ్, సుధీర్, ముస్తాక్, అశోక్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, వెండితో పాటు నిందితుడిని చూపుతున్న సీఐ విక్రమసింహ

బోరు బండిలో చెలరేగిన మంటలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ పొలాల్లో బోరు రిగ్గు వేస్తున్న బండికి సపోర్టుగా ఉండే మరో వాహనంలో సోమవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మూలింటి సుధాకర్ తన పొలంలో బోరు వేయించేందుకు మధ్యవర్తి ద్వారా బోరు బండిని పిలుపించుకున్నారు. బోరు వేస్తున్న సమయంలో పక్కనున్న బండిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడి వారంతా ఆ వాహనంలో గ్యాస్ ఉంటుందనే భయంతో పరుగులు పెట్టారు. నిప్పంటుకున్న వాహనాన్ని డ్రైవర్ సమీపంలోని నీటి కాల్వ వద్దకు తీసుకురాగా అక్కడి పంట పొలాల్లో ఉన్న వారంతా మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకుని డోన్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో వాహనదారుడికి సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వారు తెలిపారు.

బస్టాండ్ మధ్యలో బైకుల పార్కింగ్

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద బస్టాండ్‌తో పాటు కోటవీధి, సులువాయి రోడ్డులో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలు పెరగడం, బస్టాండ్ స్థలంలో మోటర్ సైకిళ్లు ఇతర వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రాత్రి సమయంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, మోటార్ సైకిళ్ల రద్దీ పెరగడంతో ప్రజలు రాకపోకలకు పలు అగచాట్లకు గురౌతున్నారు. ఇక మహిళలు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఏదైనా కొనేందుకు దుకాణాల వద్దకు వెళ్లాలంటే వాహనాలను దాటుకుని వెళ్లాల్సి వస్తోందని, సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌టీయూ పట్టణ, మండల కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

ఆదోనిసెంట్రల్: ఎస్‌టీయూ ఆదోని పట్టణం, మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ సీనియర్ నాయకుడు వెంకోబ అధ్యక్షతన తాలూకా స్థాయి సమావేశం జరిగింది. ఇందులో ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు, పరిశీలకుడిగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శి ఎస్. భీమరాజు, ఆర్థిక కార్యదర్శిగా డి.జంబులయ్యను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ బాబు, ఆర్థిక కార్యదర్శిగా షెక్షావలిని ఎన్నుకున్నారు.

రాష్ట్రంలో సంక్షేమ వెలుగులు



దీపాలు వెలుగిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం : ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటిలో సంక్షేమ వెలుగులు కొనసాగుతున్నాయని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని రాంపురం గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా సర్పంచ్ వై.జయమ్మతో కలిసి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు

చిరుత కలకలం

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు, ఎద్దులదొడ్డి సమీపంలోని కొండ, గుట్టల్లో చిరుత సంచరిస్తున్నట్లు ప్రచారం కలకలం రేపుతోంది. సోమవారం సాయంత్రం ఆయా గ్రామాల సమీపంలోని కొండల్లో సంచరిస్తున్న చిరుతను చూసి గొర్రెల కాపరులు, రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంపై గొర్రెల కాపరులు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మన్నకు సమాచారం అందించారు. ప్రజలెవరూ భయాందోళన చెందవద్దని అప్రమత్తంగా ఉండా లని ఆయన సూచించారు. వ్యవసాయ పనులు, జీవాలు మేపేందుకు వెళ్లినప్పుడు మాట్లాడుకుంటూ, కర్ర చప్పుడు చేస్తూ వెళ్లాలని సూచించారు. చిరుత కనిపిస్తే 8688467597 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అమరవీరుల ఆశయాలు సాధిద్దాం

ఆదోనిరూరల్: ప్రజా సమస్యల పోరాటంలో అమరులైన వీరుల ఆశయ సాధనే లక్ష్యంగా పోరాడుదామని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురేష్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మనెమ్మ సోమవారం పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అమరవీరుల వర్ధంతి వారోత్సవాల సందర్భంగా పట్టణంలో అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ జి.ఉరుకుందప్ప స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ చేసి నివాళులర్పించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాగేంద్రప్ప, జగదీష్ పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా అల్లావలి ఉరుసు

హొళగుంద: దేవరగట్టులో వెలసిన హజరత్ అల్లావలి సాహెబ్ 17వ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. వేడుకలకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో గంధం, ఉరుసు కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక ఇతర కార్యక్రమాలు జరిగాయి. ఉరుసుకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.



అలంకరణలో అల్లావలి దాదా సమాధి

8 మందిపై కేసు నమోదు

ఆదోనిరూరల్: మండలంలోని సాంబగల్ గ్రామంలో పొలంలో పైపులైన్ ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి సోమవారం విలేకరులకు తెలిపారు. పైపులైన్ ఏర్పాటు విషయంలో ఘర్షణకు దిగడంతో వారిని అక్కడి నుంచి చెదరగొట్టి పంపించామన్నారు. ఓ వర్గానికి చెందిన షేక్షావలి, షేక్ మౌలా, షేక్ మహబూబ్‌బాషా, షేక్ నబులు, అలాగే మరొక వర్గానికి చెందిన షేక్ దివాన్‌సాబ్, షేక్ బాబావలి, షేక్ నభిసాబ్, షేక్ హుసేన్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

గోనెగండ్ల: మండలంలో మిరప సాగుచేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల ఏఓ హేమలత రైతులకు సూచించారు. సోమవారం గోనెగండ్లలో మిరప పంటలను పరిశీలించారు. మిరప పంటను తామర పురుగు, పచ్చ రబ్బరు పురుగు, కొంచెం బూడిద తెగులు సోకినట్లు గమనించామన్నారు. తామర, పచ్చ రబ్బరు పురుగు నివారణకు ఫ్లుక్సా మెటమైడ్ 16 మి.లీ./20 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి సోమవారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి వేకువజాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహామంగళ హారతులు ఇచ్చిన ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

దర్గాలో అమావాస్య పూజలు



దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం అమావాస్య పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వరుసగా సెలవు రోజులతో పాటు ఆదివారం మజ్జిద్ ప్రారంభోత్సవ వేడుకలు జరగడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామి సమాధికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి.

సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆదోనిసెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహానికి సోమవారం పూర్వ విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. 1983–1984 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో 2021లో శ్రీసరస్వతీ, వినాయకస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. రెండవ వార్షికోత్సవం సందర్భంగా అభిషేకం, పూజ కార్యక్రమాలు చేపట్టారు. పూర్వ విద్యార్థులు కె.నాగరాజు, గురుమూర్తి, నరసరెడ్డి, హనుమంతరావు, కృష్ణ కుమార్, ప్రసాద్, మల్లేష్, కృష్ణమూర్తి, వైకుంఠవాసులు నాగరాజు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోసిగి: స్థానిక సచివాలయం-5 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మూడు రోజుల పాటు సచివాలయ పరిధిలోని గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. మండలస్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

మంత్రాలయంలో నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

మంత్రాలయం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి మంగళవారం పర్యటించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమానికి ముఖ్య అతిగా హాజరుకానున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ముందుగా రాఘవేంద్రసర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత రాఘవేంద్రపురం సచివాలయ సమీపంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించనున్నారు.

జయప్రదం చేయండి

ఆదోనిరూరల్: ఈనెల 17, 18, 19వ తేదీల్లో నంద్యాలలో జరిగే మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ కొర్రపాటి జయమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.అజయ్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం వారు సీపీఐ కార్యాలయ ఆవరణలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావిరాజు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు పాల్గొన్నారు.